క్లుప్తంగా

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు

కంభం: మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ వైవీ నరసింహారావు, ఫారెస్ట్ అధికారి మధు ప్రియాంకలు మాట్లాడుతూ గ్లోబల్ టైగర్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అడవులను రక్షించుకోవడం, జంతువులను కాపాడుకోవడం మనందరి బాధ్యతన్నారు. ప్రధానోపాధ్యాయుడు అల్లూరు శివ కోటేశ్వరరావు, అటవీ శాఖ అధికారులు మహబూబ్ సుభానీ, కళ్యాణి, అశోక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గంగయ్య మృతదేహం

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరు–వేంపాడు మధ్య చిలకలేరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్మలూరు గ్రామానికి చెందిన చొప్పరపు గంగయ్య (54)కు తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలులో చికిత్స పొందుతూ బుధవారం ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గంగయ్యను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో 108లో అద్దంకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

466 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని చిన్న ఓబినేనిపల్లె, పెద్ద ఓబినేనిపల్లెలో గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న ఓబినేనిపల్లెలో 296 మందికి, పెద్ద ఓబినేనిపల్లెలో 466 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 95 మందికి కంటి శస్త్ర చికిత్సలు, ఈఎన్‌టీ ఆపరేషన్‌లు 11 మందికి, సాధారణ శస్త్రచికిత్సలు 10 మందికి అవసరమని గుర్తించారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతో రహదారుల అభివృద్ధి



కొత్తపాలెంలో పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని పలు గ్రామాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సహకారంతో రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు కల్లం సుబ్బారెడ్డి, గుర్రపుశాల శ్రీనివాసులు తెలిపారు. గురువారం కొత్తపాలెం నుంచి ఒంగోలు–కర్నూలు రోడ్డు వరకు రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించే పనులు ప్రారంభించారు. ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని దోసకాయలపాడు ఎస్సీ కాలనీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ కేజీఎస్ రాజు తెలిపారు. గురువారం ఎస్సీ కాలనీలో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు నిల్వలను పరిశీలించారు. వాటిని శుభ్రం చేయించారు. కాలనీలో మురుగు నీరు బయటకు వెళ్లే వీలు లేనందున అందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ఎస్టిమేషన్ వేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఈఓఆర్డీ ఆదేశించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

చీమకుర్తి: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని గురువారం చీమకుర్తిలో మున్సిపల్ వర్కర్‌లు సీఐటీయూ జెండాలు చేతబట్టి తమ నిరసనలు చేపట్టారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కోవిడ్ కాలంలో పనిచేసిన కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యాల యోహాను, అల్లడి కోటేశ్వరరావు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు సత్వర సేవలు

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు
- తురిమెళ్లలో రైతు భరోసా కేంద్రం ప్రారంభం



ఆర్‌బీకేని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీలు సులభతరంగా అందుతున్నాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. తురిమెళ్లలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర సౌకర్యాలన్నీ తమ గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయని, తద్వారా రైతులు పనుల కోసం మండల కేంద్రాల్లో ఉన్న కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని చెప్పారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, రైతులు వేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే వారికి పంట నష్టపరిహారాలు, బీమా, గిట్టు బాటు ధరలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సర్పంచ్ సుభద్ర, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యేలం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఖాసింబీ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డెయిరీ నిర్వహణకు రుణం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం డేవిడ్

యర్రగొండపాలెం: మహిళా సంఘాల సభ్యులు తాము సొంతంగా డెయిరీ పెట్టుకునేందుకు పాలవెల్లువ పథకం ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని డీఆర్‌డీఏ–వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎం డేవిడ్ అన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మహిళా సంఘాల వీవోఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్ సభ్యుల జీవనోపాధి మెరుగు పరుచుకునేందుకు అవసరమైన రుణాలు ఇచ్చేందుకు సర్వే జరపాలని వీవోఏలకు ఆయన సూచించారు. యూనిట్‌లు పెట్టుకునేందుకు ముందుకొచ్చిన మహిళా గ్రూపుల సభ్యులకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఈ, జగనన్న బడుగు వికాస్ పథకాల ద్వారా రూ లక్ష నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు ఇప్పించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డేవిడ్ సూచించారు. ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఏపీఎం సుబ్రహ్మణ్యం, కృపమ్మ, స్త్రీనిధి మేనేజర్ వీరారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, అకౌంటెండ్ మాధవి పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

తాళ్లూరు (ముండ్లమూరు): మహిళలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో వీఓఏలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని జేడీఎం దర్శి క్లస్టర్ ప్రత్యేకాధికారి రజనీకాంత్ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం వీఓఏలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న తోడు, బ్యాంకు రుణాలు, సామాజిక పెట్టుబడి నిధి, వైఎస్సార్ చేయూత పథకాలను అర్హులకు అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. గ్రామాల వారీగా పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, జేపీవీ ఏపీఎం సుబ్బారావు, ఏపీఎం దేవరాజు, స్త్రీనిధి మేనేజర్ పవన్‌కళ్యాణ్, వీఓఏలు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీఏ వైఎస్సార్ పథం జిల్లా డీపీఎం డేవిడ్ అన్నారు. పుల్లలచెరువులో మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి అధ్యక్షతన వీఓఏలకు ప్రత్యేక సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, వీఆర్ఎస్ తదితర రుణాలు నెల నెలా క్రమం తప్పకుండా సభ్యులచే చెల్లించేలా చూడాలన్నారు. ప్రతి సభ్యురాలు దగ్గరకు వెళ్లి తీసుకున్న రుణం పెండింగ్ లేకుండా త్వరగా చెల్లించేలా దృష్టి పెట్టాలన్నారు. జగనన్న బడుగు వికాస్, పీఎంఈజీపీ, పీఎంఎఫ్, ఎంఈ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు ఇప్పించనున్నట్లు చెప్పారు. జగనన్న పాల వెల్లువ ద్వారా డెయిరీకి పాలు పోస్తున్న సభ్యులకు సొంత డెయిరీ పెట్టుకునేందుకు అవసరమైన రుణాలు కల్పిస్తామన్నారు. ఏపీఎంలు సుబ్రహ్మణ్యం, వెంకటయ్య, శ్రీనిధి మేనేజర్ వీరారెడ్డి, సీసీ వలి, అకౌంటెంట్ మాధవి పాల్గొన్నారు.

పాఠశాలల్లో లైఫ్ కార్యక్రమాల అమలు



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు

మార్కాపురం: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో లైఫ్(లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు తెలిపారు. గురువారం మార్కాపురంలోని ఆయన కార్యాలయంలో లైఫ్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో పర్యావరణ అంశాలపై అవగాహన సదస్సులు, ర్యాలీలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏపీ ఎన్‌జీసీ తరఫున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు, మార్కాపురం క్లస్టర్ కోఆర్డినేటర్ ఒద్దుల రవిశేఖర్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 75 అంశాలను పాఠశాలలు అనుసరించాలని తెలిపారు. ఎంఈఓ–2 శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యుత్, నీటి ఆదా, ఏకకాలంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ఏర్పాటు చేసుకోవడం తదితర పర్యావరణ అంశాలను పాటించాలని తెలిపారు. ఎస్టీయూ నాయకుడు ఎర్రయ్య పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సుధాకర్

కొనకనమిట్ల: పొదుపు గ్రూపు సంఘాల బలోపేతానికి కృషి చేయాలని వీఏఓలకు వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ సూచించారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొబైల్ బుక్ కీపింగ్ గ్రేడింగ్, స్త్రీనిధి ఉన్నతి, బ్యాంక్ లింకేజీ రుణాలు, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్, వైఎస్సార్ చేయూత, సేల్స్ వర్క్‌డన్, ఎఫ్‌పీజీ గ్రూపుల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఇటీవల పొదుపు గ్రూపు సంఘాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు విరివిగా బ్యాంక్ రుణాలు ఇప్పించామని ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. సమావేశంలో డీపీఎం కృపారావు, బ్యాంక్ లింకేజి యాంకర్ పర్సన్ సుబ్బారావు, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఎల్.నాగభూషణం, సీసీలు యర్రా, రామయ్య, సురభయ్య, వెంకటరెడ్డి, వీఓఏలు పాల్గొన్నారు.

ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

గిద్దలూరు రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చేయాలని స్థానిక తహసీల్దార్ డి.సీతారామయ్య అన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ఎన్నికల నిబంధనల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చూడాలన్నారు. పుట్టింట్లో వివాహమైన మహిళా ఓటును, చనిపోయిన వారి ఓటు తొలగించాలన్నారు. నెలల తరబడి స్థానికంగా నివాసం లేని వారి ఓట్లను సైతం ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు వివరించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించే ప్రసక్తే లేదని బీఎల్‌ఓలను హెచ్చరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు, అవకతవకలు లేకుండా బీఎల్‌ఓలు ఒక ప్రణాళికబద్ధంగా జాబితా తయారు చేయాలని, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా అన్ని రాజకీయ పార్టీల సమ్మతితో ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తోందన్నారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్లు సుబ్బారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ముండ్లమూరు: గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి నిష్పక్షపాతంగా ఓట్లు గుర్తించాలని రీసర్వే డీటీ స్రవంతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లో అర్హత ఉన్న వారికి ఓటు హక్కు ఉందా లేదా అని గుర్తించాలన్నారు. అర్హత ఉండి ఓటు లేకుంటే వారికి ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్‌వోలదే అన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా సరి చేయాలని చెప్పారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. సమావేశంలో డీటీ పుల్లారెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో ఇంటింటి సర్వే సందర్భంగా అర్హతగల ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ కేవీ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహించాల్సి ఉందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆగస్టు 7న కలెక్టరేట్ ముట్టడించనున్నట్లు చెప్పారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు హరి, సుబ్బరాయుడు, తిరుమలయ్య, ఇమాంసా, సలాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలకు సెల్యూట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: దేశరక్షణలో నిమగ్నమై అనుక్షణం శ్రమిస్తున్న సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కారుమానిపల్లి గ్రామానికి చెందిన మంచా భాస్కరరావు హవల్దార్‌గా పదవీ విరమణ పొంది గ్రామానికి వచ్చిన సందర్భంగా గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. దేశాన్ని కాపాడుతున్న సైనికుల సేవలు మరువలేమన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం భాస్కరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్ వీరయ్య, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కె.రామాంజనేయరెడ్డి, నాయకులు వెలుగొండారెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, కాశయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ ఉద్యోగిపై విచారణ



విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్

కొమరోలు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ డీఈవో గురువారం విచారణ చేపట్టారు. ఎమ్మార్సీ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రవీంద్రనాథరెడ్డిపై పలు అభియోగాలు మోపుతూ స్పందన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కాపురం డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాసరావులు ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలోని తోటి ఉద్యోగులు, పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను విచారణ చేశారు. కార్యాలయంలో ఎంఈవో కావడి వెంకటేశ్వర్లును డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రవర్తనపై ఆరా తీశారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్, సీఆర్‌పీలు లిఖితపూర్వకంగా రవీంద్రనాథరెడ్డిపై వస్తున్న ఆరోపణలు నిజమా, కాదా అని రాయించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై విచారణ చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఎంఈవో–2 బి.వెంకటరత్నం పాల్గొన్నారు.

పనితీరు మెరుగు పరుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఎం రజనీకాంత్

ముండ్లమూరు: సంఘాల్లోని మహిళలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని జాబ్స్ జిల్లా మేనేజర్, వైఎస్సార్ క్రాంతి పథం దర్శి క్లస్టర్ ప్రత్యేకాధికారి రజనీకాంత్ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం గ్రామ సంఘ సహాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసి అన్ని సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా అర్హులకు రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయాలన్నారు. అర్హత ఉన్న వారికి ఎస్సీ, ఎస్పీ, టీఎస్పీ రుణాలు ఇవ్వాలన్నారు. జగనన్న బడుగు వికాసం 45 శాతం రాయితీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ రుణాలను 35 శాతం రాయితీపై ఇచ్చేందుకు అవకాశం ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే సమావేశం నాటికి పనితీరు మెరుగు పరుచుకోని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా జేపీవీ ఏపీఎం సుబ్బారావు, ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, స్త్రీనిధి మేనేజర్ పవన్ కళ్యాణ్, ఏపీఎం హనుమంతరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వం నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాళ్లూరు (ముండ్లమూరు): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తాళ్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం 2023–2024 సంవత్సరానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లెవి ప్రసాద్, మండల నాయకులు కొమ్మినేని శేషు, నారిపెద్ది శ్రీను, సంగు రవిచంద్రారెడ్డి, పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఖాజావలి, జవహర్‌బాబు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు సహకరించండి

ఒంగోలు అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆ దిశగా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ విజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి ఓటర్ లిస్టు సర్వే చేస్తారన్నారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ప్రక్రియకు ప్రతి సహకరించాలని కోరారు. ఎలక్షన్ డీటీ రఫీ, శ్రీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు దామరాజు క్రాంతికుమార్, స్వరూప్, రాజశేఖర్, అజయ్, సత్యం, రసూల్, రమేష్, రవీంద్ర, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని శామంతపూడి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్.నాగరాజమ్మలను పాఠశాల ఉపాధ్యాయులు దామా తిరుపతిస్వామి, వి.రామిరెడ్డి, వై.రాజశేఖరరెడ్డి, కె.సుబ్బుకృష్ణలు ఘనంగా సన్మానించారు. అమరా రామారావు, రవికుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ దీక్ష

గిద్దలూరు రూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బి.నరసింహ మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు థామస్, శ్రీను, మురళి పాల్గొన్నారు.

పాఠశాలలకు సెమిస్టర్ పుస్తకాల సరఫరా



పుస్తకాల సరఫరాను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

యర్రగొండపాలెం: మండలంలోని పాఠశాలలకు సెమిస్టర్–2 పుస్తకాలను గురువారం సరఫరా చేశారు. కేవలం ఒక్క రోజులోనే 79 పాఠశాలలకు 29,072 పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సదుపాయం కల్పించిందని, దీని వలన రవాణా ఖర్చు, శ్రమ లేకుండా పోయిందని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ అన్నారు. పుస్తకాల సరఫరాకు సహకరించిన సీఆర్‌పీలు, హెచ్ఎంలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సీఆర్‌పీలు మూర్తి, దుర్గారావు, కోటి, శ్రీను, హనుమానాయక్, ఎల్లయ్య, ఎండీయూలు లక్ష్మీరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు, కస్తూరిబా గాంధీ విద్యాలయానికి మొత్తం 70 పాఠశాలలకు 17,524 సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలను గురువారం పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. పౌర సరఫరాల శాఖ అధికారుల సాయంతో వాహనాల ద్వారా పంపిణీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఎంఈఓ–2 షేక్ అమీర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com